సాక్షి
వైఎస్సార్ జిల్లా
శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025



అవినీతిని నిరూపిస్తే రాజకీయ సన్యాసం

కడప నగరపాలక సంస్థలో తాను అవినీతి చేసినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తానని మాజీ మేయర్ కె.సురేష్ బాబు అన్నారు. - 10లో





జీవిత ఖైదీకి గోల్డ్ మెడల్

జీవిత ఖైదు అనుభవిస్తున్న గునుకుల యుగంధర్ డిగ్రీలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి గోల్డ్ మెడల్ సాధించారు. - 10లో

గరిష్టం/కనిష్టం
33.6 /25.0

వాతావరణం

జిల్లాలో గురువారం 25.0 - 33.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

అర్హులకు పదోన్నతులు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ ఉద్యోగుల పదోన్నతికి సంబంధించి అటెండర్ నుంచి సీనియర్ అసిస్టెంట్ వరకు పదోన్నతులు ఇవ్వాలని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ అడహక్ కమిటి మెంబర్స్ శ్రీనివాసులు, సురేష్, చంద్రశేఖర్‌లతోపాటు సభ్యులు కోరారు. ఈ విషయమై గురువారం ఇంటర్ ఆర్‌జేడీ సురేష్‌బాబుకు తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సిబ్బంది పదోన్నతులకు సంబంధించి రోస్టర్ పాయింట్ డిస్‌ప్లే చేసిన తర్వాతే అందరికీ పదోన్నతులు కల్పించాలని కోరారు.

ఇన్‌చార్జి మేయర్‌గా ముంతాజ్ బేగం

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ ఇన్‌చార్జి మేయర్‌గా ముంతాజ్ బేగంను నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత మేయర్ సురేష్ బాబుపై ప్రభుత్వం అనర్హత వేటు వేయడంతో కొత్త మేయర్ ఎన్నికయ్యే వరకూ డిప్యూటీ మేయర్‌గా ఉన్న ముంతాజ్ బేగంకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం సాయంత్రం ఆమె బాధ్యతలు స్వీకరించే అవకాశముంది.

విశ్లేషణాత్మక ఆలోచన ముఖ్యం

– ఆర్కేవ్యాలీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా



జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి తదితరులు

వేంపల్లె : విద్యార్థులు ఆవిష్కరణాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచనతో పాటు ఉత్తమమైన శక్తిని కలిగి ఉండాలని, అప్పుడే అనుకున్న విజయాన్ని సాధించవచ్చని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా అన్నారు. గురువారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2025 లో భాగంగా విద్యార్థులు అభివృద్ధి చేసిన వివిధ విభాగాల అప్లికేషన్లు ప్రదర్శించారు. దాదాపు 106 టీమ్‌లు ప్రదర్శనలు చేయగా.. ఇందులో 50 ఎంపిక చేశారు. ఎంపికైన టీమ్ సభ్యులను జాతీయ స్థాయికి పంపనున్నారు. అకాడమిక్ డీన్ రమేష్ కైలాస్, ఎస్పీఓసీ కోఆర్డినేటర్ ఉదయశ్రీ పాల్గొన్నారు.

నెలాఖరు వరకు గడువు

కడప సిటీ : మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద పండ్ల మొక్కల పెంపకానికి 100 శాతం సబ్సిడీతో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెలాఖరు వరకు గడువు ఉందని, ఆసక్తి, అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని డ్వామా పీడీ బి.ఆదిశేషారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు 1250 మంది రైతులు 2742 ఎకరాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. 1030మంది రైతులకు సంబంధించి 2200 ఎకరాల్లో గుంతలు తీయడం జరిగిందన్నారు. 920 మంది రైతులకుగాను 2058 ఎకరాల్లో ప్లాంటేషన్ ప్రారంభించినట్లు వెల్లడించారు. 103 మంది రైతులకుగాను 134 ఎకరాలకు సంబంధించి గుంతలు తీసి మొక్కలు నాటాల్సి ఉందన్నారు. ఈనెలాఖరు వరకు గడువు ఉందని, దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు ఈ అవకాశం ఉందని ఆయన వివరించారు. మరిన్ని వివరాలకు ప్లాంటేషన్ మేనేజర్ ప్రతాప్ 90008 90293 నంబర్లో సంప్రదించాలని సూచించారు. మండలాల్లో సంబంధిత ఏపీఓలను కలవొచ్చని తెలిపారు.

ఎరువుల పంపిణీలో జాగ్రత్తలు తీసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి, ఏడీఏలు

– జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా త్వరలో రబీ సీజన్ ప్రారంభమవుతుందని ఎరువుల పంపిణీకి సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయశాఖ ఏడీలతోపాటు మండల వ్యవసాయ అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంటలకు సంబంధించి పంటకోత ప్రయోగాలను నిర్వహించాలని సూచించారు. అలాగే రబీ సీజన్‌లో విత్తనాల పంపిణీలో ఎక్కడ అవకతవకలకు జరకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లావ్యవసాయ కార్యాలయ ఏడీఏ మాధవితోపాటు అన్ని డివిజన్ల ఏడీలు, అన్ని మండలాల ఏఓలు పాల్గొన్నారు.

అవినీతి ఖాకీ



- అసెంబ్లీ వేదికగా అధికార పార్టీ ఎమ్మెల్యే వరద ఆరోపణలు
- జూదం, క్రికెట్ బెట్టింగ్ వ్యవహారాల్లో అధికారుల పాత్ర
- ఆరోపణలపై విచారణ చేయించాలని డిమాండ్
- నాడు ఎంపీ రమేష్, నేడు ఎమ్మెల్యే వరద నోట జూదం మాట

పోలీసుశాఖలో అవినీతి అధికారులు కొనసాగుతున్నారు. డైరెక్టుగా డీఎస్పీలయినోళ్లు కూడా అవినీతికి పాల్పడుతున్నారు. సమస్యలపై వారికి చెప్పినా నిరుపయోగమే అవుతోంది. ప్రొద్దుటూరులో గుట్కా, మట్కా, క్రికెట్ బెట్టింగ్స్ నిర్వహిస్తున్నారు. ఆరోపణలు వచ్చినప్పుడు ఉన్నత అధికారి విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. కిందిస్థాయి అధికారులను కొంతమంది కాపాడుతున్నారు.
– ఈ నెల 25వ తేదీ.. అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

జమ్మలమడుగు కేంద్రంగా విచ్చలవిడిగా పేకాట నిర్వహిస్తున్నారు. దేవగుడికి చెందిన వ్యక్తులు లక్షల్లో జూదం ఆడిస్తున్నారు. కుటుంబాలు సర్వనాశనం అవుతున్నాయి. జూదం క్లబ్‌లను కట్టడి చేయండి. వైఎస్సార్ జిల్లా ఎస్పీ, కలెక్టర్‌కు అభ్యర్థన.
– ఇటీవల బీజేపీ ఎంపీ రమేష్‌నాయుడు బహిరంగ లేఖ.

సాక్షి ప్రతినిధి, కడప : జిల్లా పోలీసుశాఖ పనితీరుకు కూటమి నేతల మాటలు నిలువెత్తు అద్దంపడుతున్నాయి. వారి ఆరోపణల్లో వాస్తవాలు లేకపోలేదు. ప్రజాసమస్యల కంటే వ్యక్తిగత అజెండాకు కొంతమంది పోలీసు అధికారులు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం పరిపాటిగా మారింది. అసాంఘిక శక్తులపై ఖాకీల కరుకుతనం తగ్గిపోయింది. సివిల్ పంచాయతీలు, భూ తగాదా సెటిల్మెంట్లపై వారి మనసు మళ్లింది. ఉన్నతాధికారులు ప్రశ్నించినప్పుడు క్రికెట్ బెట్టింగ్, జూదం వ్యవహారాలపై నామ్‌కేవాస్తే తనిఖీలు నిర్వహించే పోలీసులు.. ప్రశ్నించే వారిపై ఎదురుదాడికి దిగుతూ చట్ట ప్రయోగాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇక ఛాలెంజింగ్ కేసులు ఛేదించడంలో కూడా విఫలం చెందుతున్నారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ గండికోటలో మైనర్ బాలిక హత్య కేసే.

తొలుత హడావుడి.. ఆపై లేదు పురోగతి...

పర్యాటక ప్రాంతమైన గండికోటలో ఈ ఏడాది జూలై 14న బాలిక హత్య జరిగింది. స్నేహితుడి మోటార్ బైక్‌పై వెళ్లిన బాలిక తిరుగు ప్రయాణంలో లేదు. రాష్ట్రంలో సంచలనంగా మారిన బాలిక హత్య జరిగి 70రోజులు అవుతోన్నా ఇప్పటికీ కేసు తేల్చలేదు. ఎక్కడ వేసినా గొంగళి అక్కడే అన్నట్లుగా ఉండిపోయింది. క్లూస్ టీమ్ పరిశీలించింది. డాగ్ స్క్వాడ్ పర్యటించింది. టవర్ లోకేషన్ తీశారు. ఫోన్ కాల్స్ టెక్నికల్ విశ్లేషణ చేశారు. ఇద్దరు ఐపీఎస్ స్థాయి అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో నలుగురు డీఎస్పీలు, నలుగురు సీఐలు, 10మంది ఎస్ఐలు దృష్టి పెట్టారు. అయినప్పటికీ కేసులో ఎలాంటి పురోగతి సాధించలేదు. హత్యలో స్నేహితుడు లోకేష్ ప్రమేయం లేదని, నిందితుల్ని సాయంత్రంలోగా అదుపులోకి తీసుకొని ఎస్పీ హత్య వివరాలు తెలియజేస్తారని స్వయానా డీఐజీ కోయ ప్రవీణ్ మీడియా ఎదుట ప్రకటించారు. రెండు నెలలు దాటినా సదరు హత్య కేసు కొలిక్కి రాలేదు. పోలీసుల వ్యవస్థకు సవాల్‌గా నిలిచిన ఈకేసులో పురోగతి లేకపోగా, అధికారుల పనితీరుపై సందేహాలు కలుగుతున్నాయి.

ఏకపక్ష చర్యలతో అభాసుపాలు

జిల్లాలో ఏకపక్ష చర్యలతో పోలీసుశాఖ అభాసుపాలవుతోంది. అందుకు పులివెందుల పోలీసుల ఏకపక్ష చర్యలను పరిశీలకులు ఉదాహరిస్తున్నారు. పులివెందులలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ కూడళ్లకు టీడీపీ మహానాడు సందర్భంగా ఆ పార్టీ జెండాలు, తోరణాలు కట్టారు. ఇది మంచి పద్ధతి కాదు, వైఎస్ విగ్రహాలకు ఉన్న టీడీపీ తోరణాలు తొలగించాలంటూ మున్సిపల్ కమిషనర్‌కు, పులివెందుల డీఎస్పీకి వైఎస్సార్‌సీపీ శ్రేణులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి ఆయా సర్కిళ్లలో టీడీపీ జెండాలు తొలగించాలి. అలా చేయకపోవడంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కొంతమంది వైఎస్ విగ్రహాలకు ఉన్న టీడీపీ జెండాలు మాత్రమే తొలగించారు. అదే అదునుగా భావించి టీడీపీ నేత విజయ్‌కుమార్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడినట్లు కేసు నమోదు చేశారు. పులివెందులలో క్రియాశీలకంగా ఉన్న వైఎస్సార్‌సీపీ నేతల్ని కేసులో చేర్చారు. అంతటితో ఆగకుండా ముగ్గురు మైనర్లను కూడా కేసులో చేర్చారు. ఇదే విషయమై బాధితులు హైకోర్టును ఆశ్రయించగా జెండాలు తొలగిస్తే హత్యాయత్నం కేసు ఎలా అవుతుందని హైకోర్టు సైతం ప్రశ్నించింది.

పేకాట క్లబ్‌లపై కట్టడి ఏదీ?



జిల్లాలో ప్రొద్దుటూరు కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్, మట్కా ఉన్నాయని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అసెంబ్లీ వేదికగా గళం విప్పారు. ఒక్క ప్రొద్దుటూరే కాదు జమ్మలమడుగు, పులివెందుల, కడప సబ్ డివిజన్లలోనూ ఆదే తంతు నడుస్తోంది. జమ్మలమడుగులో మరింత విస్తృతమైంది. కూటమి నేతల ప్రమేయంతో జూదంతోపాటు, మట్కా సైతం ఆడిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఒక స్టేషన్ పరిధిలో ప్రధాన బుకీలపై కేసులు నమోదు చేసిన పోలీసులు తర్వాత వారిని అరెస్ట్ చేయకుండా తాత్సారం చేశారు. ఈ కేసులో పోలీసులకు భారీగా ముడుపులు అందినట్లు ఆరోపణలు ఉన్నాయి. పేకాట అనధికారికంగా కొనసాగుతోంది. జిల్లా కేంద్రంలో నాలుగు క్లబ్‌లు ఉంటే యథేచ్ఛగా ఒక్క క్లబ్‌లో నిరంతరాయంగా పేకాట ఆడుతోన్నట్లు పలువురు చెప్పుకొస్తున్నారు. గండికోటలో పేకాట ఆడుతున్న వారిని జమ్మలమడుగు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి లక్షల్లో నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు తెలిసే పేకాట కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో కొంతమంది డబుల్ స్టార్, ట్రిపుల్ స్టార్ అధికారులు చట్టం, న్యాయం, ధర్మం పక్కకు తోసేసి ఖద్దరు నేతల మెప్పు కోసమే తాపత్రయం చూపుతున్నారు. ఇలాంటి పరిస్థితులను కట్టడి చేసి సరైన మార్గంలో వ్యవస్థను నడిపించాలని ఇటీవల ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన షెల్కే నచికేత్ విశ్వనాథ్‌ను ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకుంటాం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకుంటామని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక భాకరాపురంలోని తన స్వగృహంవద్ద ఆయన మాట్లాడారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. కేవలం అధికారాన్ని అడ్డుపెట్టుకొని నియంతృత్వ పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. పవన్‌కళ్యాణ్ ఓజీ సినిమాపై ఉన్న శ్రద్ధ రాష్ట్రంలోని ప్రజలపై ఈ ప్రభుత్వానికి లేకపోవడం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు ఆయన తనయుడు లోకేష్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు హైదరాబాద్ టు విజయవాడ తిరిగేందుకు వేలకోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎన్ని అక్రమకేసులు పెట్టినా వైఎస్సార్ సీపీ నాయకులు కానీ.. ఏఒక్క కార్యకర్తగానీ భయపడే పరిస్థితి ఉండదన్నారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లు తమ పార్టీ వారిని అక్రమంగా వేధించిన వారిని ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తి ఉండదని స్పష్టం చేశారు. తెలుగుదేశం నాయకులు, అధికారులు.. పోలీసులు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

డిపోల అభివృద్ధిపై దృష్టి పెట్టాం!

- బస్టాండ్లలో మౌలిక వసతులను మెరుగుపరుస్తాం
- పీటీడీ వైస్ చైర్మన్, ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు



ఆర్టీసీ బస్టాండులో అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎండీ

మైదుకూరు/కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్రంలోని పీటీడీ(ఆర్టీసీ) డిపోలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టామని సంస్థ వైస్ చైర్మన్, ఎండీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన మైదుకూరు డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో డిపోలను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. గుడివాడ డిపోలో పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గుత్తి డిపో అభివృద్ధిని కూడా చేపట్టామని తెలిపారు. పీటీడీ స్వయంగా చేయడం లేదా పీపీపీ ద్వారా చేసే ఆలోచనలో ఉన్నట్లు వివరించారు. ఆగస్టు 15న ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం రాష్ట్రంలో సజావుగా విజయవంతంగా సాగుతోందని తెలిపారు. బస్సుల్లో కొన్ని స్వల్ప సంఘటనలు జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. పీటీడీ బస్టాండ్లలో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎండీ వెల్లడించారు. వర్షం వస్తే మోకాళ్ల లోతు నీటితో ఉండే బస్టాండ్లు ఉన్నాయని అలాంటి వాటిని బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మూడు నెలల్లో పీటీడీకి 1,050 ఎలక్ట్రికల్ బస్సులు రానున్నట్లు ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. మైదుకూరు డిపో మేనేజర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో పనిచేయాలి

ప్రతి ఒక్కరూ ఇష్టంతో పనిచేయాలని ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు సూచించారు. గురువారం సాయంత్రం జిల్లా పర్యటనకు వచ్చిన ఎండీ కడప ఆర్టీసీ గ్యారేజీని రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి (ఇంజనీరింగ్)తో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనల చేశారు. కడప బస్టాండును ఆధునీకరించేందుకు రూ.1.30 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించి నాలుగు నెలల్లో సీసీ రోడ్లు పూర్తి చేస్తామన్నారు. ఆర్టీసీ ఆర్ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి, డిప్యూటీ సీటీఎం డిల్లీశ్వరరావు, ఆర్టీసీ వీఅండ్ఎస్ఓ ధర్మతేజ, ఈఈ శ్రీనివాసులు, డీఈ పోతురాజు, యూనియన్ నాయకులు పురుషోత్తం, ఏఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లో కలపాలి

రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలోని వివిధ విభాగాల్లో 8వ వేల మంది ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్నారని, వారిని ఆప్కాస్‌లో కలపాలని ఆయా ఉద్యోగులు ఎండీ ద్వారక తిరుమలరావును విన్నవించారు.

లోకపావనీ.. జగజ్జననీ!



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



ప్రొద్దుటూరులోని చెన్నకేశవస్వామి ఆలయంలో గజలక్ష్మీదేవిగా..



కడప..శ్రీ గజలక్ష్మీదేవిగా శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి



కడప అమ్మవారిశాలలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అన్నపూర్ణగా అనుగ్రహించినా.. లక్ష్మీదేవిగా కటాక్షించినా.. గజలక్ష్మీగా వరమిచ్చినా.... అన్ని రూపాలూ ఆమెవే.. కరుణించేది ఆ లోకపావనే.. ఈ జగమంతా జగజ్జననిదే.. దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను కరుణించారు. విద్యుత్ దీప కాంతుల్లో సువర్ణ ఆభరణాలతో మెరిసిపోతున్న అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని తిలకించి భక్తులు పైమరిచిపోతున్నారు. తమ పిల్లాపాపలను చల్లగా చూడాలని అమ్మవారిని మనసారా మొక్కుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. – నెట్‌వర్క్

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : జీఎస్టీ పన్నుల తగ్గింపుపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుంచి అక్టోబర్ 19 వరకు 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్'పై ప్రజల్లో అవగాహన, వివిధ రూపాల్లో ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా అవగాహన సమావేశాలు, పాఠశాలలు, కళాశాలల వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ముందుగా జాయింట్ కమిషనర్ స్టేట్ టాక్సెస్ జి.సుమతి కొత్త జీఎస్టీ ప్రకారం వివిధ రంగాల వారీగా జీఎస్టీ వర్తింపు ఎలా జరుగుతుందనే వివరాలను క్లుప్తంగా వివరించారు. ఈ సమావేశంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

గ్రామాల్లో సుస్థిర ఆదాయ మార్గాలు పెరగాలి

స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో సుస్థిర ఆదాయ మార్గాలు పెరగాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి డ్వామా, ఉద్యాన, మండల అభివృద్ధి అధికారులను ఆదేశించారు. గురువారం ×ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా నీటి భద్రత - గ్రామీణాభివృద్ధి అనే అంశంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర జలశక్తి అభియాన్ శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి హాజరయ్యారు. వీసీ ముగిసిన అనంతరం డ్వామా, ఉద్యాన, మండల అభివృద్ధి అధికారులు, అనుబంధ శాఖల అధికారులతో ఎన్ఆర్ఈజీఎస్ - జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపడుతున్న, చేపట్టాల్సిన వివిధ రకాల పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం లోపు ఒక్క లక్ష ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగులోకి తేవాలని, అందులో భాగంగా ఈ ఏడాది చివరి నాటికి కనీసం 50 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగులోకి తీసుకువచ్చే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, భూగర్భ గనుల శాఖ డీడీ మురళీధర్, ఇరిగేషన్ అధికారులు, అన్ని మండలాల ఎంపీడీఓలు, డ్వామా ఏపీడీలు, ఏపీఓలు పాల్గొన్నారు.

పర్యావరణ సహిత జిల్లా మనందరి బాధ్యత

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాను పర్యావరణ సహితంగా తీర్చిదిద్దే బాధ్యత మనందరి చేతుల్లో ఉందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా 'బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్'పై కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని ఆసుపత్రులు, ఫ్యాక్టరీల సంఖ్య.. అవి ఉత్పత్తి చేసే వ్యర్థాలు, వాటి నిర్వహణ పనితీరు ఎలా జరుగుతుంది..? అన్న అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.

విమానాశ్రయ అభివృద్ధికి చర్యలు

కడప విమానాశ్రయ అభివృద్ధికి అన్నిరకాల చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అన్ని రకాల భద్రతా ప్రమాణాలతో భవన నిర్మాణాలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్‌లో ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌తో కలిసి ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు.సేఫ్టీ, సెక్యూరిటీకి సంబంధించిన పలు విషయాలను సంబంధిత అధికారులతో చర్చించారు. విమానాశ్రయం డైరెక్టర్, కమిటీ కన్వీనర్ సుజిత్ కుమార్ పొద్దర్,కమీషనర్ మనోజ్ రెడ్డి, ఆర్డీవో జాన్ ఇర్విన్, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

4న వాహనాల వేలం

రాయచోటి టౌన్ : రవాణాశాఖ అధికారులు తనిఖీల్లో పట్టుకున్న వాహనాలను అక్టోబర్ 4వ తేదీ వేలం వేస్తున్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని రాజంపేట ఆర్టీసీ డిపోలో అక్టోబర్ 4వ తేదీ ఉదయం 10 గంటలకు వేలం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ధరావత్తు రూ.5 వేలు చెల్లించి (చలానా పొందాలి) వేలంలో పాల్గొనవచ్చన్నారు. ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ చూపించి టోకెన్ పొందాలని సూచించారు. వేలానికి సిద్ధంగా ఉన్న వాహనాల వివరాలు జిల్లా రవాణాశాఖ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్ : మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి హిదాయతుల్లా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్, సెక్రటరీ షేక్ గౌస్ పీర్ ఆధ్వర్యంలో నవంబర్ 11న అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను విజయవాడలోని రాష్ట్ర ఉర్దూ అకాడమి డోర్ నంబర్76-1-06ఏ/1, 2 మాళవిక విల్లా, హెచ్‌బీ కాలనీ, భవానీపురం -520012 చిరునామాకు పంపాలని సూచించారు.

క్లుప్తంగా

లీగల్ ఎయిడ్ క్లినిక్ సందర్శన



మాట్లాడుతున్న ఎస్.బాబా ఫక్రుద్దీన్

పులివెందుల టౌన్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎస్.బాబా ఫక్రుద్దీన్ పులివెందుల సబ్ జైలులో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను గురువారం సందర్శించారు. రిజిష్టర్లు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం గురించి వివరించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలు, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జైలు పరిసరాలు, రిజిష్టర్లను పరిశీలించి సూచనలు చేశారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్, న్యాయవాదులు, ఖైదీలు పాల్గొన్నారు.

నకిలీ ఉత్పత్తుల స్వాధీనం



నకిలీ షట్టర్ భాగాలు, అచ్చు స్వాధీనం చేసుకున్న పోలీసులు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో నకిలీ జేఎస్‌డబ్ల్యూ సిల్వర్ పూత కలిగిన షట్టర్ 18 షట్టర్ భాగాలు, ముద్రణ అచ్చులు కడప తాలూకా పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. జేఎస్‌డబ్ల్యూ కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ బ్రాండెడ్ ఉత్పత్తుల నకలు తయారు చేసి అసలైనవిగా మార్కెట్‌లో విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కస్టమర్లు, బ్రాండ్ సమగ్రతను రక్షించడానికి జెఎస్‌డబ్ల్యూ స్టీల్ నిరంతరం పనిచేస్తుందన్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిర్దిష్ట సమాచారం ఉందన్నారు. దీంతో తమ స్టీల్ కోటెడ్ బృందం షట్టర్ ఉత్పత్తులు, దాని ట్రేడ్ మార్క్ సిల్వర్ గుర్తు దుర్వినియోగాన్ని ధృవీకరించేందుకు దర్యాప్తు నిర్వహించిందన్నారు. ఈ నేపథ్యంలోనే కడప ఎస్‌డీఎస్ సన్స్ భాగోతం బయట పడిందని, సమాచారం పోలీసులకు అందించామని తెలిపారు.

ఫైనాన్షియర్ హత్య కేసులో టీడీపీ నేత



టీడీపీ సమావేశంలో ఎమ్మెల్యే వెంట సుబ్బారెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలో సంచలనం రేపిన ఫైనాన్షియర్ వేణుగోపాల్‌రెడ్డి హత్య కేసులో టీడీపీ నేత ఎదమకంటి వెంకట సుబ్బారెడ్డిని ఏ2గా చేర్చినట్లు పోలీసులు తెలిపారు. హత్య కేసులో అదే పట్టణానికి చెందిన బిల్డర్ వెన్నపూసలక్ష్మిరెడ్డి, ఎదమకంటి వెంకట సుబ్బారెడ్డితోపాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన బోయినినగేష్, లైని అజయ్ కుమార్, చింతలచెరువు ప్రణయ్ కుమార్, కొత్త శివప్రసాద్ నిందితులుగా ఉన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని బాకరాపేట వీధికి చెందిన ఎదమకంటి వెంకటసుబ్బారెడ్డి టీడీపీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి అనుచరుడిగా ఉంటూ టీడీపీ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. టీడీపీ నేతల అండ చూసుకునే అయన ఈ హత్యలో పాల్గొని ఉంటాడనే ప్రచారం జోరుగా సాగుతోంది.

అవినీతిని నిరూపిస్తే రాజకీయ సన్యాసం

- నిరూపించలేకపోతే రాజకీయాల నుంచి వైదొలగుతావా?
- తీర్మానం చేయకుండా అజెండా పేపర్లు చించేసింది ఎమ్మెల్యే కాదా?
- 16 నెలల్లో కడప అభివృద్ధికి రూపాయి నిధులు తెచ్చారా?
- నన్ను పదవి నుంచి దించి కుర్చీలో కూర్చోవాలని చూస్తున్నారు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే మాధవిపై విరుచుకుపడిన మాజీ మేయర్ సురేష్ బాబు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మేయర్ కె.సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థలో తాను అవినీతి చేసినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తా.. నిరూపించలేని పక్షంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి రాజకీయాల నుంచి తప్పుకుంటారా అని మాజీ మేయర్ కె.సురేష్ బాబు సవాల్ విసిరారు. స్థానిక అపూర్వ ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ టీడీపీ నేత శ్రీనివాసులురెడ్డి వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని ఎద్దేవా చేశారు. కడపను భ్రష్టుపట్టించి దోచేశారని 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2 కోట్ల బిల్లులు చేసుకుని అక్రమాలకు పాల్పడింది నీవు కాదా అని ప్రశ్నించారు. మహానాడుకు ముందు బుగ్గవంకలో కంప చెట్లు తొలగించి రూ.30 లక్షల పనికి రూ.3 కోట్లు దోచేశావంటూ ఆరోపించారు. 17 ఏళ్లుగా కాంగ్రెస్, ఇటు వైఎస్సార్ కాంగ్రెస్‌లో జిల్లా అధ్యక్షుడిగా పని చేశానని, పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలుగా భావించి అందరినీ కలుపుకొని పోయి పనిచేశానన్నారు. 20ఏళ్ల టీడీపీ జెండా మోసిన కార్యకర్తలను ప్రక్కన బెట్టి నియోజకవర్గాన్ని చక్కదిద్దుకోలేని శ్రీనివాసులురెడ్డి ఒక మనిషేనా అని మండిపడ్డారు.

నీరు చెట్టు నిధులు నొక్కేశారు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలైంది.. కడప నగరాభివృద్ధికి రూపాయి నిధులు తెచ్చారా.. ఒక్క రోడ్డు, కాలువ నిర్మించారా అని సూటిగా ప్రశ్నించారు. సొమ్మొకరిది.. సోకొకరిది అన్నట్లు 15వ ఆర్థిక సంఘం కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులకు, కార్పొరేషన్ సాధారణ నిధులతో జరిగే పనులకు టెంకాయలు కొట్టడానికి సిగ్గుండాలన్నారు. నీరు–చెట్టు నిధులను పందికొక్కుల్లా మేసిన మీరా మమ్మల్ని విమర్శించేది అంటూ నిలదీశారు. ప్రధాన రహదారుల విస్తరణ, కూడళ్లు అందంగా తయారయ్యాయంటే దివంగత వైఎస్సార్, మాజీ సీఎం వైఎస్ జగన్‌వల్లేనని గుర్తు చేశారు. బుగ్గవంగ సుందరీకరణకు వైఎస్సార్ రూ.70 కోట్లు ఇస్తే, వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రూ.72కోట్లు ఇచ్చారని, వాటితోనే రక్షణ గోడ పూర్తయి అప్రోచ్ రోడ్డు పనులు జరుగుతున్నారన్నారు. టీడీపీ ఎన్నిసార్లు అధికారంలోకి వచ్చినా కడపను అభివృద్ధి చేసింది శూన్యమన్నారు.

తీర్మానాలను అడ్డుకుది మీరు కాదా....?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 4 జనరల్ బాడీ మీటింగులు జరిగితే ఒక్కటి కూడా సజావుగా జరక్కుండా ఎమ్మెల్యే మాధవి అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. జూలై 4న జరిగిన మొదటి సమావేశంలో సొంత పార్టీ కార్పొరేటర్‌నే తిట్టిపోశారని, కార్పొరేటర్ల భర్తలకు ఎలాంటి ప్రోటోకాల్ ఉండదని చెప్పి, తన భర్తను మాత్రం అధికారిక సమావేశాలకు తీసుకెళ్తున్నారని ఎద్దేవా చేశారు. 2024 డిసెంబర్, 23న తీర్మాణాలకు ఆమోదం తెలుపకుండా ఎజెండా పేపర్లు చించేసింది ఎవరో తెలీదా...2025 జూన్, 20న తాము చేసిన తీర్మానాలు అమలు కాకుండా కోర్టుకు వెళ్లింది మీరు కాదా.. అని ప్రశ్నించారు. పూటకో పార్టీ మారే మీరా తనను విమర్శించేది అని మండిపడ్డారు. దేశంలో ఎక్కడా మేయర్‌తో సమానంగా ఎక్స్‌అఫిషియో సభ్యులకు కుర్చీలు వేయరని, రాష్ట్ర మంత్రులైనా కార్పొరేటర్లతో సమానంగా కూర్చోవాల్సిందేనన్నారు. పదవులు తనకు కొత్త కాదని, సర్పంచ్‌గా, జెడ్పీ ఛైర్మెన్‌గా, రెండు సార్లు మేయర్‌గా చాలా ఏళ్లు ప్రతిపక్షంలోనే కొనసాగి అన్ని పార్టీల మన్ననలు పొందానని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీళ్లకు కప్పం కట్టలేక రియల్ ఎస్టేట్ వ్యాపారులంతా బెంగళూరు, హైదరాబాద్‌లలో వెంచర్లు వేస్తున్నారని, 16 నెలల్లో కడపలో ఒక్క వెంచర్‌గానీ, ఒక్క అపార్ట్‌మెంట్‌గానీ నిర్మించబడలేదన్నారు.

మేము ఇలాగే కక్షపూరితంగా వ్యవహరించి ఉంటే..

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు తాము ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసులురెడ్డిలాగా కక్షపూరితంగా వ్యవహరించి ఉంటే టీడీపీ కార్యకర్తలు మిగిలి ఉండేవారా అని సురేష్‌బాబు ప్రశ్నించారు. వాళ్లలాగా తాము ఎవరినీ పీడించ లేదన్నారు. పదవులు శాశ్వతం కాదని, దేవుడు అనుగ్రహిస్తే ఇంతకంటే మంచి పదవులు వస్తాయన్నారు. తనను మేయర్ పదవి నుంచి దించేసి ఆ కుర్చీలో కూర్చోవాలని చూస్తున్నారని, కుర్చీపై ఉన్న వ్యామోహంతో ఇదంతా చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కుర్చీ పిచ్చి ఎంత ముదిరిందంటే...ఆగష్టు 15న వేదికపై కుర్చీ కావాలని ఐఏఎస్ అధికారులనే దూషించేస్థాయికి వెళ్లిందన్నారు. ఇంత చేసిన ఆమెను కుర్చీలో కూర్చొనిచ్చే ప్రసక్తే లేదని, తమ కార్పొరేటర్లు సైనికుల్లా మారి అడ్డుకుంటారని హెచ్చరించారు.

టీడీపీ తొత్తుల్లా వ్యవహరిస్తున్న అధికారులు

ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ మొదలుకొని కమిషనర్ వరకూ తెలుగుదేశం పార్టీ తొత్తుల్లా వ్యవహరిస్తున్నారని సురేష్‌బాబు మండిపడ్డారు. మంగళవారం రాత్రి 9 గంటలకు తనపై అనర్హత వేటు వేసినట్లు మీడియాలో వచ్చిందని, వాస్తవానికి ఆ ఉత్తర్వులు ఈ రోజు అందాయన్నారు. ఈ లోపే గెజిట్ ప్రకటించి, డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగానికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేసేశారన్నారు. తనను పదవి నుంచి దించేయడానికి ఆఘమేఘాలపై శరవేగంగా పనిచేస్తున్న అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో ఇంతే వేగం చూపితే ప్రజలు హర్షిస్తారని చురకంటించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు షఫీ, ఆరీఫుల్లా బాషా, షంషీర్ బాషా, బాలస్వామిరెడ్డి, చెన్నయ్య, కో ఆప్షన్ సభ్యులు బి. మరియలు, జహీర్, పత్తిరాజేశ్వరి, డివిజన్ ఇన్‌చార్జులు మల్లికార్జున కిరణ్, డిష్‌జిలాన్, బసవరాజు, అక్బర్, గౌస్, సుబ్బరాయుడు, రామక్రిష్ణారెడ్డి, దాసరి శివప్రసాద్ పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌తో మాజీ డిప్యూటీ సీఎం చర్చలు



నాయకులతో మాట్లాడుతున్న అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, ఆమె భర్త మాజీ కార్పొరేటర్ జమాల్‌వలితో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వం మేయర్ సురేష్ బాబుపై అనర్హత వేటు వేసి డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగానికి ఇన్‌చార్జి మేయర్ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆమె బాధ్యతల స్వీకరణ, అందుకు సంబంధించిన ఏర్పాట్లపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అజ్మతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు బసవరాజు, డిష్ జిలాన్, రెడ్డి ప్రసాద్, రమేష్ రెడ్డి, గయాజ్, అతావుల్లా, డా. మురాద్, మున్నా, మహబూబ్ పాల్గొన్నారు.

ఏపీఎస్‌ఆర్టీసీ ఎండీని కలిసిన ఎస్పీ

కడప అర్బన్ : రాష్ట్ర పూర్వ డీజీపీ, ప్రస్తుత ఏపీఎస్‌ఆర్‌టీసీ ఎండీ సిహెచ్.ద్వారకాతిరుమల రావు కడపలో గురువారం పర్యటించారు. నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఆయనను ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆత్మీయంగా ఒకరికొకరు శుభాకాంక్షలను తెలియజేసుకున్నారు.

సామాజిక రుగ్మతలు తొలగించడమే లక్ష్యం



సమావేశంలో జేసీ అదితిసింగ్, ఎస్పీ

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు విధులు నిర్వర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన కేసులలో బాధితులకు న్యాయంతోపాటు త్వరితగతిన పరిహారం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. భూ సమస్యలు ఉంటే త్వరితగతిన పరిష్కరించాలని, భవిష్యత్తులో అట్రాసిటీ కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. నేరాలను తగ్గించేలా, అట్రాసిటీ చర్యలకు పాల్పడితే పడే శిక్ష, కేసులు, సెక్షన్ల అంశాలను వివరించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని, పోక్సో, బాల్య వివాహాల చట్టాలపై అందరికీ అవగామన కల్పించాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, డీఎస్పీలు వెంకటేశ్వర్లు(కడప), భావన (ప్రొద్దుటూరు), మురళి(పులివెందుల), రాజేశ్వర్ రెడ్డి (మైదుకూరు), తదితరులు పాల్గొన్నారు.

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి



మాట్లాడుతున్న వెంకట జనార్దన్‌రెడ్డి

ప్రొద్దుటూరు : ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ వెంకటజనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక శ్రీరాములపేట ఒంటేరు ఉపాధ్యాయ సేవా కేంద్రంలో కార్యవర్గ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వచ్చాక మనస్ఫూర్తిగా పండగ చేసుకుందామని భారీ ఎత్తున ఓట్లు వేసి గెలిపిస్తే ఒక ద్రవ్య భత్యం కానీ, మధ్యంతర భృతి కానీ ఇవ్వలేదన్నారు. పీఆర్సీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీచేయకపోవడంతోపాటు, గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను చెల్లించకపోవడం బాధాకరమైన విషయమన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రూ.30 వేల కోట్ల డీఏ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ప్రతినిధి బోగాగంగాధర్ మాట్లాడుతూ.. డీఈఓ పూల్‌లో మిగులు పండితులకు వెంటనే పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వానికి పెద్ద మనసు ఉంటే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. 2003 డీఎస్సీ ఫోరం కన్వీనర్లు రిజ్వాన్ అలీ, బాలజోజప్ప, పుల్లయ్య మాట్లాడుతూ.. మెమో నెంబరు 57ను వెంటనే అమలు చేయాలని కోరారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ.. వాటిని ఎలా పొందాలో ఉద్యోగులకు దిక్కు తోచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడు నాగచంద్రుడు, అబ్బాస్, చింతంరెడ్డి మాధవరెడ్డి, సుబ్బారెడ్డి, మూలె బ్రహ్మానందరెడ్డి, నాగరాజు, నాగేంద్ర పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



మృతిచెందిన చంద్రశేఖర్‌రెడ్డి

కడప అర్బన్ : నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నబీకోటకు చెందిన చెన్నకేశవ రెడ్డి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి (25) దుర్మరణం చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. ఖాజీపేట మండలానికి చెందిన చెన్నకేశవరెడ్డి లారీడ్రైవర్ గా పనిచేస్తూ తన కుటుంబ సభ్యులతో నబీకోటలో నివాసముంటున్నాడు. పెద్ద కుమారుడైన చెన్నకేశవరెడ్డి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో నబీకోటకు చెందిన తన స్నేహితుడు యువకిషోర్‌తో కలిసి బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై అలంకాన్ పల్లె వైపు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. మార్గ మధ్యంలో వినాయక నగర్‌కు వెళ్లే దారిలో ఓ కారును ఓవర్ టేక్ చేయబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్‌రెడ్డికి తీవ్రగాయాలు కాగా స్థానికులు వెంటనే రిమ్స్ కు తరలించారు. చంద్రశేఖర్‌రెడ్డి చనిపోయాడని డాక్టర్లు నిర్ధారించారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న యువకిషోర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చేతికొచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు బంధువులు, స్నేహితులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు తెలిపారు.

పవర్ బీఈతో విద్యార్థులకు ఉపయోగం

చాపాడు : విద్యార్థులకు పవర్ బీఈ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఎంతో ఉపయోగమని హైదరాబాద్‌కు చెందిన రేష్ యాప్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ ప్రతినిధి నాగేంద్ర అన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కాలేజీ విద్యార్థులకు గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ పవర్ బీఈ అనేది ఒక అడ్వాన్స్‌డ్ ఎక్సెల్ నేర్చుకోవడంతో విద్యార్థులకు వివిధ రకాల ఉపయోగాలు ఉన్నాయన్నారు. ఉద్యోగాలు పొందడానికి ఈ టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతుందని, బిజినెస్‌లో ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే ఈ డేటా మార్గదర్శకంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ లోహిత్‌రెడ్డి, డైరెక్టర్ అడ్మిన్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపల్ డా.ఎస్.శృతి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆటో డ్రైవర్ల నిరసన



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, ఆటో డ్రైవర్లు

కడప సెవెన్‌రోడ్స్ : వాహనమిత్ర గడువు పొడిగించడంతోపాటు అర్హులైన ప్రతి ఆటో కార్మికుడికి షరతులు లేకుండా పథకాన్ని వర్తింపజేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ సెక్రటరీ కేసీ.బాదుల్లా, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ఆటో డ్రైవర్లతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లైసెన్స్ కలిగిన ప్రతి డ్రైవర్‌కు వాహనమిత్ర ద్వారా రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ఆటో డ్రైవర్ల పిల్లలకు 50 శాతం రాయితీతో విద్య, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. చంద్రన్న బీమా ద్వారా సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాద మరణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. జీఓ నెంబరు 21, 31లను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు నారాయణ, పుల్లయ్య, రెడ్డెయ్య, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూలో తాత్కాలిక ఫ్యాకల్టీ నియామకం



యూనివర్సిటీ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(కడప)లో తాత్కాలిక విజిటింగ్ ఫ్యాకల్టీ నియామకాలు చేపట్టనున్నట్లు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్ తెలిపారు. ఆర్కిటెక్చర్ విభాగానికి సంబంధించి బి.ఆర్క్‌లో కనీసం 60 శాతం మార్కులు, మూడేళ్ల వృత్తి అనుభవం, బి.ఆర్క్‌తోపాటు మాస్టర్స్ డిగ్రీ(సంబంధిత సబ్జెక్ట్)లో కనీసం 60 శాతం మార్కులు, మూడేళ్ల అనుభవం కలిగి ఉండే వాళ్లు అర్హులని తెలిపారు. అలాగే ఇంటీరియర్ డిజైన్ విభాగానికి సంబంధించి బి.ఆర్క్.లో కనీసం 60 శాతం మార్కులు, సంబంధిత పీజీ అర్హతతో పాటు కనీసం మూడేళ్ల డిజైన్ అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. అలాగే ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఆర్కిటెక్చర్/ప్లానింగ్/జాగ్రఫీ/ఎకనామిక్స్/సోషియాలజీ డిగ్రీతోపాటు మాస్టర్ ఆఫ్ ప్లానింగ్‌లో ఫస్ట్ క్లాస్ ఉండాలని తెలిపారు. ఈ పోస్టులకు ఈ నెల 26వ తేదీ ఉదయం పది గంటలకు చెన్నూరు మండలం రాయలపంతులపల్లిలోని డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు తమకు సంబంధించిరి రెజ్యూమ్‌తో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు సెట్ జిరాక్స్ కాపీలు తీసుకుని నేరుగా వాక్– ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు. అభ్యర్థులు తమకు నచ్చిన అంశంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ లేదా డెమో క్లాస్ ఇవ్వాల్సి ఉంటుందని వీసీ విశ్వనాథకుమార్ తెలిపారు.

జిల్లాలో సినిమా షూటింగ్ చేయడం అభినందనీయం

ప్రొద్దుటూరు కల్చరల్ : జిల్లాలో సినిమా షూటింగ్ చేయడం అభినందనీయమని సినీ హబ్ అధ్యక్షుడు బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారీ జాకీర్‌అహ్మద్ అన్నారు. స్థానిక సినీ హబ్‌లో డైమండ్ డెకాయిట్ సినిమా పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ జిల్లాకు చెందిన సినిమా హీరో పార్థుగోపాల్ ఇక్కడి 50 లోకేషన్లలో సినిమా తీయడం హర్షణీయమన్నారు. రాయలసీమలోనే షూటింగ్ చేయడంతో రాష్ట్రంలో సినిమా రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. హీరో గతంలో శ్రీమంతుడు సినిమాలో నటించారని, నేడు హీరోగా సినిమా తీయడం అభినందనీయమన్నారు. హీరో పార్థుగోపాల్, దర్శకుడు సూర్యజీ యాదవ్ మాట్లాడుతూ రెండు సంవత్సరాలు శ్రమించి అందమైన లోకేషన్లలో ఈ సినిమా తీశామన్నారు. ఈ కార్యక్రమంలో మన ప్రజా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, గంగాప్రసాద్, ఓబులేసు, నారాయణ, ఫరాన్ తదితరులు పాల్గొన్నారు.

జీవిత ఖైదీకి గోల్డ్ మెడల్

ఓపెన్ డిగ్రీలో మంచి మార్కులతో ప్రతిభ



జీవితఖైదీ యుగంధర్ (ఫైల్)



మీడియాతో మాట్లాడుతున్న యుగంధర్ తల్లి చెంగమ్మ, చెల్లెలు మేఘన

కడప అర్బన్ : జీవిత ఖైదు అనుభవిస్తున్న గునుకుల యుగంధర్ డిగ్రీలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి గోల్డ్ మెడల్ సాధించారు. కడప కేంద్ర కారాగారం అధికారులు, యుగంధర్ తల్లి చెంగమ్మ, చెల్లెలు మేఘన వివరాల మేరకు.. కడప కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్న యుగంధర్ ప్రస్తుత తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం జంగాలపల్లి నివాసి. 2011 జూలై, 18న హత్య కేసులో జీవిత ఖైదు విధించబడి కేంద్ర కారాగారానికి వచ్చాడు. అప్పటినుంచి ఓల్డ్ పాటర్న్‌లో రెండు బీఏ డిగ్రీలు, న్యూ పాటర్న్‌లో ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్(సీబీఎస్‌సి)లో రెండు బీఏ డిగ్రీలు, మూడు ఎంఏ డిగ్రీలు, కంప్యూటర్, కార్పెంటరీ, నాక్ స్కిల్స్‌లో సర్టిఫికెట్లు పొందాడు. ఇటీవల డిగ్రీలో 8.02 జీపీఏతో అత్యుత్తమ ప్రతిభ కనబరచి మంచి ర్యాంకు సాధించడంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ గోల్డ్ మెడల్, బుక్ ప్రైజ్ దక్కాయి. ఈ నెల 30న హైదరాబాద్‌లో మెడల్ అందుకోనున్నారు. ఇతడు పారా లీగల్ వలంటీర్‌గా పనిచేశారని అధికారులు తెలిపారు.

నా బిడ్డకు క్షమాభిక్ష పెట్టండి

హత్య కేసులో 20 ఏళ్లుగా జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న తన కుమారుడు యుగంధర్‌కు క్షమాభిక్ష పెట్టాలని అతడి తల్లి చెంగమ్మ, సోదరి మేఘన కోరారు. గోల్డ్ మెడల్ సాధించి సత్ప్రవర్తన కలిగి ఉన్నాడని.. ప్రభుత్వం గుర్తించి తన బిడ్డను విడుదల చేయాలని కోరారు.

27న కడపలో జష్న్-యే-నాతియ మెహఫిల్

కడప సెవెన్‌రోడ్స్ : మహమ్మద్ ప్రవక్త జన్మదిన మాసోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే నాతియా మెహఫిల్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని మహా ప్రవక్త పట్ల తమ అభిమానాన్ని చాటుకోవాలని వికాస్ విద్యా సంస్థల అధినేత సుభాన్‌బాషా పిలుపునిచ్చారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార రథాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 27న కడప గుంతబజారు మసీదు వద్ద జరిగే ఈ కార్యక్రమానికి భారతదేశంలోని ప్రముఖ కవులు, నాత్ గాయకులు వస్తున్నారని తెలిపారు. శ్రీ నాతియా మేహిఫీల్ కార్యక్రమానికి కులమతాలకతీతంగా ప్రజలు పాల్గొంటారన్నారు. సుల్తాన్‌బాషా, ఉస్మాన్‌ఖాన్, రఫీవుద్దీన్, బాబు, అల్లా బకష్, షబ్బీర్, మహమ్మద్, మాయనా ఖాజా పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అమ్మేసేందుకే కూటమి వచ్చింది

- 17 నెలల్లో ఒక్క ఇటుక కూడా పేర్చలేదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని అమ్మేసేందుకే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. పార్టీ కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అవినీతి విలయతాండవం చేస్తోందని, కిందిస్థాయి నుంచి ముఖ్యమంత్రి వరకూ దోచుకోవడం, దాచుకోవడం నిత్యకృత్యమైందన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుక్షణమే లక్షల టన్నుల ఇసుక డంప్ చేసి అమ్మేసుకున్నారని, మట్టి, మైన్స్, సిలికా..... ఇలా దేన్నీ వదలకుండా దోచుకుంటున్నారన్నారు. మద్యం విచ్చలవిడిగా ఏరులై పారిస్తున్నారని, బెల్టు షాపులు, పర్మిట్ రూములు పెట్టి సొమ్ముచేసుకుంటున్నారన్నారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌ల నుంచి మద్యం అక్రమరవాణా అవుతోందని, దొంగసారా కూడా టీడీపీ నేతలే కాస్తున్నారన్నారు. ప్రజారోగ్యం పట్ల కాస్తయినా శ్రద్ధ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మట్కా కంపెనీలు, పేకాట క్లబ్బులు విపరీతంగా పుట్టుకొస్తున్నాయని, ఐదారు వేలకే మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తున్నారని మండిపడ్డారు. ఇదంతా పెద్ద స్కాం అని, టెండర్లు వేసిన వారు జైలుకు పోక తప్పదని హెచ్చరించారు. మెడికల్ కాలేజీల టెండర్ కండీషన్లు అధ్వాన్నంగా ఉన్నాయని, మల్టిపుల్ టెండర్లు రాకపోతే వాటిని రద్దు చేయాల్సి ఉండగా, సింగిల్ టెండర్ వచ్చినా ఆమోదిస్తున్నారన్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ప్రభుత్వ సంస్థలను పప్పులు, బెల్లాలకు ప్రైవేటుకు అమ్మేస్తారని, ఇప్పుడూ అదే జరుగుతోందన్నారు. చంద్రబాబు హయాంలోనే షుగర్ ఫ్యాక్టరీలు, పాల ఫ్యాక్టరీలు, ఆల్విన్ ఫ్యాక్టరీ మూతబడ్డాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో నిత్యావసర సరుకులు, పెట్రో ధరలు భగ్గుమంటున్నాయని, కరెంటు బిల్లు ముట్టుకుంటే షాక్ కొడుతోందన్నారు. దేవ స్థానాలు, హాస్పిటల్స్‌లో పారిశుద్ధ్య టెండర్లు కేంద్రీకృతం చేసి కమీషన్లు దండుకుంటున్నాయని ఆరోపించారు. యూరియా లేక రైతులు విలవిల్లాడుతున్నారన్నారు. 17 నెలల్లో రూ.2.10లక్షల కోట్లు అప్పు చేసిన ఏకైక సర్కార్ ఇదేనన్నారు. అమరావతి రాజధాని పేరుతో రూ.57వేలకోట్ల పనులకు టెండర్లు పిలిచి, 10 శాతం మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇచ్చి...తిరిగి ఆ నిధులను తమ ఖాతాల్లో వేసుకున్నారన్నారు. ఇప్పటి వరకూ అమరావతిలో కంప చెట్లు తొలగించడానికి, నీళ్లు తోడటానికే సరిపోయిందని, ఒక్క ఇటుక కూడా పేర్చలేదని ఎద్దేవా చేశారు. పిల్లి పాలుతాగుతూ ఎవరూ చూడలేదులే అనుకుంటుందని, టీడీపీ నేతల తీరు కూడా అదేవిధంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఇంటికో విమానం ఇస్తామని హామీ ఇచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఈ ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

జీహెచ్ఎంసీ యాక్టుకు కాలం చెల్లింది

జీహెచ్ఎంసీ యాక్టుకు కాలం చెల్లిందని, ఆంధ్రప్రదేశ్ విడిపోయి 15ఏళ్లు కావొస్తున్నా ఇంకా జీహెచ్ఎంసీ యాక్టును పట్టుకొని వేలాడటం సరైందని కాదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షం ఉండకూడదనే కసితో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని ప్రక్కన బెట్టి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ పదవులు తీసేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే మాధవి భర్త శ్రీనివాసులరెడ్డి కాంట్రాక్టర్ కాదా.. అని ప్రశ్నించారు. కాలం చెల్లిన చట్టంతో పదవి తీసేయడం దుర్మార్గమని, కక్ష సాధింపులతో పదవులు ఊడగొట్టి రాక్షసానందం పొందుతున్నారన్నారు. సురేష్ బాబు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, చంద్రబాబు మూడేళ్లు అసెంబ్లీకి రాలేదు.. అప్పుడు ఆయన పదవి కోల్పోవాలి కదా.. వైఎస్ జగన్ పదవి రద్దు చేస్తామని ఇపుడు బెదిరించడం హాస్యాస్పదమన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేష్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ ఛైర్మెన్ పులి సునీల్ కుమార్, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు, యువజన విభాగం నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర, వలంటీర్ల విభాగం అధ్యక్షుడు ఫయాజ్ అహ్మద్ పాల్గొన్నారు.